క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఆత్మకూర్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. సోమవారం స్థాని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏళ్ల తరబడిగా కనీస వేతనాలకు నోచుకోక వెట్టిచాకిరి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరునెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వకపోవడంతో అప్పులపాలు అవుతున్నారని, వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్తార్, బాలరాజు, శ్రీకాంత్, అరుణ్, శైలజ, బాలకిష్టమ్మ, నాగమ్మ, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాల అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని ఈదులబావి తండాలోని వృద్ధులకు, దివ్యాంగులకు తెలంగాణ ఉద్యమకారుడు టీజీ మహేశ్ వాకింగ్‌స్టిక్స్, స్టాండ్స్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిస్సాహాయ స్థితిలో ఉన్న వారికి తనవంతు సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. సేవా కార్యక్రమాలకు కుటుంబ సభ్యుల, స్నేహితుల సహకారం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ లక్ష్మణ్ నాయక్, భోజ్యానాయక్, లింగానాయక్, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రభుత్వ బస్సు ఏర్పాటు చేయాలి



వనపర్తిటౌన్: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు 30 మందికి చొప్పున ఒక స్కూల్ బస్సు ఏర్పాటు చేయాలని డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్‌లో జేఏసీ ఇంచార్జి కురుమన్న ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ అండ్ రాజ్యాధికార జేఏసీ, డీఎస్పీ పార్టీలు సంయుక్తంగా దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడిబాట కోసం బస్సు ఏర్పాటు చేయాలని గత వారం రోజులుగా కలెక్టర్‌కి, తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదన్నారు. బస్సు ఏర్పాటు చేయకపోతే రాష్ట్రాన్ని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దయానంద్, రాములు, జేఏసీ నాయకులు ఎల్లస్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి సిమెంట్ లారీ బోల్తా



ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఓ సిమెంట్ లారీ బోల్తాపడిన సంఘటన మండలంలోని మానాజీపేట స్టేజి సమీపంలో సోమవారం చోటు చేసుకున్నది. డ్రైవర్ కథనం ప్రకారం హైదరాబాద్ పవన్ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన ఓ లారీలో కడుకుంట్ల గ్రామానికి చెందిన తిర్పతయ్య అనే డ్రైవర్ తాండూరు నుంచి మండలంలోని సోళీపురం గ్రామానికి సిమెంటు తీసుకవస్తున్నాడు. లారీ మానాజీపేట స్టేజి సమీపంలోకి వచ్చిన వెంటనే అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో ఎవ్వరికి ప్రమాదం కాలేదు. హఠాత్తుగా లారీ అదుపుతప్పడం జరిగిందని డ్రైవర్ తిరుపతయ్య తెలిపాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొత్తకోట రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ ఆనంద్ సోమవారం తెలిపారు. పట్టణ కేంద్రంలోని జీటీ నారాయణ స్కూల్ సమీపంలో డ్రైనేజీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైనేజీ కాల్వలో నుంచి మృతదేహాన్ని బయటకుతీశారు. వ్యక్తి వయస్సు 40ఏళ్లు ఉండొచ్చని, మృతదేహాన్ని వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి కావాల్సిన వారు ఎవరైనా ఉంటే ఎస్ఐకి 8712670621 నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలియజేయాలని కోరారు.

ముందు జాగ్రత్త.. పశువులకు రక్ష

- అప్రమత్తంగా లేకపోతే రోగాలబారిన పడే ప్రమాదం
- పశువైద్య అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి



వనపర్తి శివారులో మేత మేస్తున్న గొర్రెలు

వనపర్తి రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాతావరణ మార్పులు, అపరిశుభ్రత వంటి అంశాల వల్ల మనుషులతో పాటు పశువులు పలురకాల వ్యాధులు బారిన పడే ప్రమాదం ఉంది. పచ్చికబయళ్లలో లేత గడ్డి రావడం వలన వాటిపై క్రిమి కీటకాలు, వైరస్, బ్యాక్టీరియాలు ఉంటాయి. వాటిని తిన్న పశువులు వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో తెల్ల, నల్లజాతి పశువులు, మేకలు, గొర్రెల పోషకులు వాటి ఆరోగ్య విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పరిసరాలు బురదమయం కావడంతో పశువులు అందులో తిరగడం వల్ల మట్టిలోని రసాయనాలు, బ్యాక్టీరియాలు పాదాలకు అంటుకొని, కాళ్లగెట్టల్లో పుండ్లు ఏర్పడుతాయి. తెల్లపశువుల్లో జబ్బవాపు, గేదెల్లో చిటుక్క రోగం, గాలికుంటు వ్యాధి, గొంతువాపు, లంపిస్కిన్, నీలినాలుక తదితర వ్యాధులు వచ్చే సోకే ప్రమాదముంది. పశుపోషకులు, జీవాల పెంపకందారులు ఎప్పటికప్పుడు పశువైద్యుల సలహాలు, సూచనలతో ముందుకెళ్లాలి. ఆహారం ఎప్పుడు పొడిగా, శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధులు సోకకుండా అందుబాటులో ఉన్న పశువైద్య ఆసుపత్రికి వెళ్లి, వైద్యుల సలహాల మేరకు ముందస్తుగా టీకా వేయిస్తే మేలు.

జిల్లాలో మూగజీవాల వివరాలు

గొర్రెలు	మేకలు	పందులు
9,76,832	80,608	8,922
ఆవులు	గేదెలు	
75,089	72,531	

సూచనలు పాటించాలి

జిల్లాలోని పలు గ్రామాల్లో తెల్ల, నల్లజాతి పవువులకు గాలికుంటు టీకాలు 1,03,060, గొంతువాపు 8043, జబ్బవాపు 7403, లంపిస్కిన్ 52,453 టీకాలు వేశాం. గొర్రెలకు పాటు వ్యాధి టీకాలు 3,64849, గొర్రెపిల్లలకు 2,47,718 టీకాలు వేశారన్నారు. ఈ సీజన్‌లో నిత్యం పశువులను గమనిస్తూ జాగ్రత్తలు పాటించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని పశువైద్యులను సంప్రదించి సూచనల మేరకు టీకాలు వేయించాలి.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా పశువైద్యాధికారి

సమతుల పోషకాలతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మోజర్ల గ్రామంలో ఉద్యాన కళాశాల నిర్వహిస్తున్న జాతీయసేవా పథక ప్రత్యేక శిబిరంలో నాల్గోరోజు ఎన్ఎస్ఎస్ అధికారి భాస్కర్ అధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీలో పోషకాహార లోపాలపై కలిగే నష్టాలను వివరించారు. అసమతుల్య పోషకాలు, పేదరికం, అస్వచ్ఛత ఆహారం, సరైన పోషకాలు తీసుకోకపోవడం, అవగాహన లేకపోవడమని ప్రధాన కారణాలని అఖిల, తరుణ్, సాయితేజ వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు అరుణ, శారదలు బాలామృతంపై గర్భిణులు, బాలింతలకు వివరించారు. ప్రతిరోజూ తప్పకుండా ఒక గుడ్డును ఆహారంగా తీసుకోవాలని ప్రైమరీ స్కూల్ హెచ్ఎం యుగంధర్ సూచించారు. ఆత్మహత్యలు నివారణ కోసమని ఇటీవలి కాలంలో మార్కులు తక్కువగా వస్తున్నాయని 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకొని బంగారు భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శిరీషా, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలకు తరలిన కార్మికులు



అమరచింత నుంచి మహాసభలకు తరలివెళ్తున్న సీఐటీయూ నాయకులు

అమరచింత: పెబ్బేరులో జరిగే సీఐటీయూ జిల్లా నాల్గో మహాసభల్లో పాల్గొనేందుకు పట్టణం నుంచి హమాలీ వర్కర్స్ యూనియన్, మున్సిపల్ కార్మి కులు సోమవారం ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో అనుబంధ కార్మిక సంఘాల నాయకులు అధికసంఖ్యలో తరలివెళ్లినట్లు మండల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాఘవ, చిన్న,ప్రభాకర్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వీపనగండ్ల: సీఐటీయూ ఆధ్వర్యంలో పెబ్బేరు పట్టణంలో సోమవారం నిర్వహించిన నాల్గో మహాసభలకు మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని పలు ప్రజాసంఘాల నాయకులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు అధికసంఖ్యలో తరలివెళ్లారు. శ్రమకుతగ్గ వేతనాలను చెల్లించాలని ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు కురుమయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, వీరస్వామి, వీరబాబు అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కొత్తకోట రూరల్: ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పానుగంటి ఆనందం సోమవారం ఒక ప్రకటనలో కోరారు. చాలీచాలనీ వేతనాలతో నెట్టుకొస్తున్న తమకు అది కూడా నెలనెలా చెల్లించకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందని వాపోయారు. దీంతో పాటు జిల్లాలో ఖాళీగా ఉన్న ఎఫ్ఏల పోస్టులను భర్తీ చేసి పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలలు పూర్తయినా తమ సమస్యలపై స్పందించకపోడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో రోజుకు రెండుసార్లు ఫొటోలు అప్‌లోడ్ చేయాలని నిబంధన పెట్టడం సరికాదని, ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో నెట్‌వర్క్ రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. కొత్త సిమ్ కార్డులు ఇచ్చి, వాటి రీచార్జ్ కోసం తమ జీతంలో నుంచే రూ.300 కట్ చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తమకు కొత్త ఫోన్లు అందించడంతో రీచార్జ్ బిల్లులు చెల్లించాలని కోరారు.

'రైతునేస్తం' సద్వినియోగం చేసుకోవాలి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించనున్న రైతునేస్తం కార్యక్రమంలో రైతులు అధికసంఖ్యలో పాల్గొనాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వానాకాలం పంటలు కలుపు, యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మునీశ్వరుల పూజలు



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంబాలపురం గ్రామంలో మునీశ్వర్ల ఆలయంలో సోమవారం గ్రామస్తులు వైభవంగా పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని భజన సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగాయి. ఆలయం దగ్గర భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను గ్రామస్తులు సన్మానించారు.

బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్ చారిత్రాత్మకం

కొత్తకోట: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని బీసీ నాయకులు అన్నారు. సోమవారం కొత్తకోట చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మేస్త్రి శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు బీచుపల్లియాదవ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు డా.పీజే బాబు, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు కృష్ణారెడ్డి, ఎన్‌జే.బోయేజ్, వనపర్తి జిల్లా రైతువిభాగం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మిషేక్, చర్లపల్లి శేఖర్‌రెడ్డి, నరేందర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో రైతులకు ఎంతో ఉపయోగం



పాన్‌గల్: వ్యవసాయరంగంలో వస్తున్న ఆధునిక పద్ధతులు, సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకొని ఖర్చులు తగ్గించుకోవాలని మండల కాంగ్రెస్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్ అన్నారు. సోమవారం కేతేపల్లి గ్రామంలో గంగా వ్యవసాయ డ్రోన్ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో కాలానికి అనుగుణంగా నూతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో విష్ణు, బాలు, బీరయ్య, శ్రీకాంత్, దర్గయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛతతో రోగాలు దూరం



ఆత్మకూర్‌లో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శశిధర్

వనపర్తి టౌన్: ఇంట్లో, వీధుల్లోని చెత్తను డ్రైనేజీల్లో వేస్తే మురుగు పారక దోమలు చేరి సర్వరోగాలు కాలనీలోని తిష్ఠ వేస్తాయని, తద్వారా వ్యాధులు సోకుతాయని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయావార్డుల్లో 100 రోజుల కార్యాచరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా, వీధి, పెంపుడు కుక్కలపై తదితర వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంల్లోని పలుషాపులపై హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ రైడ్ నిర్వహించారు. ఆయా దుకాణాల్లో ప్లాస్టిక్ దొరకడంతో యజమానులకు మొత్తం రూ.11,000 జరిమాన విధించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, డీఎంసీ బాలరాజు, సూపర్‌వైజర్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి అందరు సహకరించాలి

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు కలిసికట్టుగా పట్టణాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, దోమల నివారణకు కృషి చేయాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కమిషనర్ శశిధర్ అన్నారు. సోమవారం వందరోజుల ప్రణాళిక భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. చెత్తను బయటకు పారబోయకుండా చెత్తడబ్బాల్లో వేయాలన్నారు. అనంతరం కుక్క కాటుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నివారణ, తదితర అంశాలపై క్లుప్తంగా కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు, పురపాలిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమరచింతో అవగాహన కల్పిస్తున్న అధికారులు



జిల్లాకేంద్రంలో షాపు యజమానికి జరిమానా విధిస్తున్న అధికారి

ప్లాస్టిక్‌తో ప్రమాదకర వ్యాధులు

అమరచింత: ప్లాస్టిక్‌ను నిత్యం వాడుకోవడం ద్వారా ప్రమాదకరమైన వ్యాధులకు గురవుతారని మున్సిపల్ మెనేజర్ యూసుఫ్ అన్నారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలో శుక్రవారం 4వ వార్డులో ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మురుగుకాల్వల శుభ్రత, బ్లీచింగ్ చల్లాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాత పుస్తకాలను వినియోగించుకోవాలి



హెచ్ఎంలకు రాత పుస్తకాలు అందిస్తున్న ఎంఈఓ జయశంకర్

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం అందిస్తున్న రాత పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలల హెచ్ఎంలకు నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న రాత పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యూనిఫాంలను త్వరగా అందించాలి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలను త్వరగా అందించాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. సోమవారం మండలంలోని మహిళా సమాఖ్యలో యూనిఫాంలను కుట్టే మహిళలు, ఏపీఎం రాంబాబుగౌడ్‌తో మాట్లాడారు. ఇప్పటివరకు విద్యార్థులకు ఒక జత మాత్రమే అందించడం జరిగిందన్నారు. వీలైనంత త్వరగా యూనిఫాంలను కుట్టించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాంబాబుగౌడ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు విస్తరణలో పేదలకు న్యాయం చేయాలి



రోడ్డువెడల్పు పనులు పరిశీలిస్తున్న నాయకులు

వనపర్తి విద్యావిభాగం: రెండేళ్ల క్రితం జిల్లా కేంద్రంలోని పాతబజార్‌లో గుడులను, దర్గాలను స్వచ్ఛందంగా తీసుకుంటే వెడల్పు చేయాల్సిన రోడ్డుపై అడ్డంగా కాల్వలు నిర్మించారని ఇదేమి పాలన అని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ పాలకులను ప్రశ్నించారు. సోమవారం నాయకులు పాత బజారులోని రామాలయం ఎదుట రోడ్డుకు అడ్డంగా కట్టిన కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీచౌక్ నుంచి గోపాలపేట రోడ్‌లో పేదలఇళ్లు, గుళ్లు, దర్గాలు, పేద ఆర్యవైశుల ఇళ్లను తొలగించారు. కుటుంబాలు రోడ్డున పడితే కొందరు డబ్బున్న వారు మాత్రం వారి స్థలాలను తొలగించకుండా ఉన్నారని, జిల్లా కేంద్రంలో పేదోడికి ఓ న్యాయం, ధనవంతుడి ఓ న్యాయంలా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంబడి ఉండే కొందరి నాయకుల ప్రోద్బలంతో ఇదంతా చేస్తున్నారని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఫంక్షన్‌హాల్‌ను, కన్యకాపరమేశ్వరి అమ్మవారి గర్భగుడి ఎదుట నుంచి తొలగించి రోడ్డువెడల్పు చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కొత్తగొల్ల శంకర్, యాదయ్య, సతీష్, రామస్వామి, రవి, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హజ్రత్ ఉర్సు ప్రారంభం



హజ్రత్ సయ్యద్‌షా సాహెబ్ దర్గా

ఆత్మకూర్: పట్టణంలో వెలిసిన హజరత్ సయ్యద్ షా సాహెబ్, సయ్యద్ మౌలానా సాహెబ్‌ల ఉర్సు ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. 16వ తేదీ రాత్రి 8 గంటలకు జమేదార్ వీధిలోని ఎక్బాల్‌బిన్ సయ్యద్ ఇంటినుంచి ప్రత్యేక అలంకారాలతో గంధోత్సవం ఊరేగింపుగా ప్రారంభం కానుంది. రాత్రి 11గంటలకు దీపారాధన, ప్రముఖ గాయకులచే ఖవ్వాలీ గానకచేరి నిర్వహిస్తారు. 17వ తేదీ ఉదయం 10 గంటలకు ఖత్మేఖురాన్, ఫాతేహా కార్యక్రమాలు జరుగుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు దర్గా ప్రాంగణంలో భక్తులకు అన్నదానం ఉంటుందని నిర్వాహకులు ఖమర్‌బిన్ సయ్యద్ తెలిపారు. ఉత్సవాలకు గుల్బర్గా, హల్‌కట్టా, వట్టెంషరీఫ్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రముఖ ముర్షద్‌లు, బాబాలు హాజరు కానున్నారని తెలిపారు.

'బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి'



కొత్తకోటలో మాట్లాడుతున్న భీమన్ననాయుడు

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భీమన్ననాయుడు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఇతర బీసీ నేతల పోరాటం ఫలితంగానే ఎన్నికల సమయంలో కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై నమ్మకం, నిజమైన ప్రేమ లేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కంటి తుడుపు చర్యగా కాకుండా చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధత లేని ఆర్డినెన్స్‌ల ద్వారా బీసీలకు ఒరిగేదేమీ లేదని.. రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించకుండా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్‌కు యావత్ బీసీ లోకం తగిన బుద్ధి చెబుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో గోవర్ధన్‌నాయుడు, మండ్ల రవి, రవికుమార్, యాది, బాలరాజు, మహేందర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

అక్రమ భూ పట్టాలను రద్దు చేయాలని నిరసన



తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

వీపనగండ్ల: అక్రమంగా పలువురికి గ్రామంలో రెవెన్యూ అధికారులు పట్టాలు జారీ చేశారని వాటిని రద్దు చెయ్యాలని కోరుతూ సోమవారం మండల సీపీఐ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బొల్లారం గ్రామంలోని 618 సర్వే నెంబర్‌లో పేదప్రజలు ఇళ్లు నిర్మించుకున్నారని వారికి పట్టాలు ఇవ్వకుండా అదే గ్రామానికి చెందిన కావలి సాయిబాబా, సుదర్శన్, కావలి రాములు పేరుమీదుగా 15 ఎకరాల 15గుంటల భూమిని రెవెన్యూ రికార్డులో నమోదు చేశారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వంకగోపాల్ అన్నారు. 30 సంవత్సరాల క్రితం ఈ భూమిని ఇళ్ల స్థలాల కోసం పేదలకు ఇచ్చారన్నారు. నివాసం ఉంటున్నవారికి పట్టాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుకు విన్నవించుకున్నారని తెలిపారు. అక్రమంగా పట్టాలు పొందినవారు ఇతరులకు ఆ భూమిని విక్రయిస్తున్నారని ఆయన అన్నారు. వెంటనే అక్రమ రికార్డులను సరిచేసి పేదలకు న్యాయం చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కురుమయ్య, బొల్లారం గ్రామ పార్టీ నాయకులు చలమారెడ్డి, వేమన్న, కృష్ణయ్య, వెంకటస్వామి, శివయ్య, కురుమయ్య, చిన్నరాముడు పాల్గొన్నారు.

'420 హామీలతో నట్టేట ముంచిన కాంగ్రెస్'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి రూరల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ 420 హామీలను ఇచ్చి జనాలను నట్టేట ముంచిందని పెబ్బేరు పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు దిలీప్ కుమార్‌రెడ్డి అన్నారు. మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పెబ్బేరు పట్టణ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 11, 12 వార్డులో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ పాలనలో సబ్బండ వర్గాలు కూడా ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతుబీమా, సన్నాలకు బోనస్, కల్యాణలక్ష్మి, పింఛన్లను, నిరుద్యోగభృతి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ కరుణశ్రీ,, కర్రెస్వామి, చిన్నాల్లారెడ్డి, సాయిరెడ్డి, గోపి బాబు, రామకృష్ణ, వేణు, విశ్వరూపం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయలేదని సీపీఐ కార్యవర్గ సభ్యులు విజయుడు అన్నారు. పెద్దకొత్తపల్లిలో సోమవారం సీపీఐ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఎన్నికల అనంతరం కుటుంబానికి రూ.2 లక్షలు మాత్ర మే రుణమాఫీ చేస్తామని మేలిక పెట్టిందన్నారు. రైతులకు అన్ని రకాల యంత్ర పరికరాలను సరఫ రా చేయాలని ఆయన కోరారు. యాసంగిలో కొను గోలు చేసిన సన్న రకం వడ్లకు ఇంకా బోనస్ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కుర్మయ్య, యేసయ్య, నర్సింహా, శ్రీనివాసులు, మల్లేష్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.